సాక్షి
చిత్తూరు
సోమవారం . 14 . ఏప్రిల్ . 2025



కాణిపాకం.. భక్తజన సంద్రం

కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. వరుసగా సెలవులు రావడంతో రద్దీ నెలకొంది. - 8లో



గంజాయి స్మగ్లర్ అరెస్ట్

ఆరు నెలల పాటు పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న స్మగ్లర్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. - 8లో



తీర్థ యాత్రలో విషాదం

పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్ద ఓ టీచర్ కుటుంబం ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురయ్యింది. టీచర్ మృతిచెందింది. - 8లో

న్యూస్‌రీల్

నేడు అంబేద్కర్ జయంతి వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో సోమవారం అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబేద్కర్ జయంతి వేడుకలు సోమవారం జిల్లా కేంద్రంలో ఉదయం 9 గంటలకు దర్గా సర్కిల్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరుగుతుందన్నారు. అక్కడ నుంచి అంబేద్కర్ చిత్రపటంతో ర్యాలీగా మెసానికల్ మైదానం వద్ద ఉన్న అంబేద్కర్ భవనానికి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు, అధికారులు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 14 వ తేదీన డాక్టర్. బీఆర్ అంబేద్కర్ జయంతి ప్రభుత్వ సెలవుదినం కావడంతో ప్రజా సమస్యల వేదిక రద్దు చేయడం జరిగిందన్నారు.

మామిడి చెట్లు నరికి భూ ఆక్రమణ

– టీడీపీ నాయకుడి దౌర్జన్యం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గంగాధర నెల్లూరు : కూటమి ప్రభుత్వం అండతో ఓ టీడీపీ నేత చెలరేగిపోతున్నాడు. తహసీల్దార్ కార్యాలయంలో మకాం వేసి వైఎస్సార్‌సీపీ నాయకులనే టార్గెట్ చేస్తున్నారు. వారి భూములను దౌర్జన్యంగా ఆక్రమించి దాడులకు తెగబడుతున్నారు. బాధితుడి కథనం మేరకు గంగాధర నెల్లూరు మండలంలోని కుప్పనపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త శంకర్‌రెడ్డికి చెందిన సర్వే నం.840లో మూడెకరాల 30 సెంట్లు పొలం ఉంది. ఈ భూమిలో మామిడి చెట్లు, టేకు చెట్లను పెంచుతూ వ్యవసాయం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే శంకర్‌రెడ్డికి చెందిన భూమిలో దాదాపు 110 మామిడి చెట్లు, 50 టేకు చెట్లను అదే గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన యువ రాజురెడ్డి, గంగిరెడ్డి నరికివేసి భూ ఆక్రమణకు తెగబడ్డారని పేర్కొన్నారు. ఈ మేరకు బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడేళ్ల కిందట రూ.లక్షలు ఖర్చు చేసి చెట్లు పెంచి పెద్దవి చేయగా నేడు కూటమి ప్రభుత్వం రాగానే ఇలా దౌర్జన్యకాండ చేస్తున్నారని వాపోయారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఎంబీసీ వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 72,923 మంది స్వామివారిని దర్శించుకోగా 35,571 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.33 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పత్రికా స్వేచ్ఛను కాపాడండి

– 'సాక్షి'పై అక్రమ కేసులు ఎత్తివేయాలని ఆందోళన



కుప్పం అర్బన్ ఎస్‌ఐకి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టు సంఘం నాయకులు

కుప్పం : కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను అణగదొక్కేందుకు జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తోందని కుప్పం జర్నలిస్టు సంఘాలు ఆందోళనకు దిగాయి. 'సాక్షి' ఎడిటర్ ధనంజయ రెడ్డితో పాటు మరో ఆరుగురు పాత్రికేయులపై అక్రమ కేసులు నమోదు చేయడంపై నిరసన చేపట్టారు. అనంతరం కుప్పం అర్బన్ ఎస్ఐ బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. అక్రమ కేసులను ఉపసంహరించుకొని పత్రికా స్వేచ్ఛను కాపాడాలని ఈ సందర్భంగా జర్నలిస్టులు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అక్రమాలను వెలికితీస్తున్న 'సాక్షి' పత్రికపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తప్పుడు కేసులు నమోదు చేసి జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం చట్టరీత్యా నేరమన్నారు. 'సాక్షి'పై పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించుకొని ప్రజల పక్షాన నిలబడుతున్న పత్రికను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటాచలం, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉదయ్ రెడ్డి, స్థానిక పాత్రికేయులు హరినాథ్, నాగరాజ్, గణేష్, రవికుమార్, వెంకటేష్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆవు పిడకలు...ఆరోగ్యం

ఆవుపేడ కదా అందులో ఏముంది అనుకునే వారికి దాని విలువ తెలియకపోవచ్చు.. ముందు తరాలవారు దాని విశిష్టతను గుర్తించారు. వారికి దాని ఉపయోగాలు తెలుసు..అందుకే ఆవు పేడ నీటితో కళ్లాపి చల్లేవారు.. పేడ అలికిన ఇల్లు శుభదాయకమని చెప్పేవారు. మట్టి గోడలకు పేడను అలికేవారు.. ఇలా క్రిమి కీటకాలను ఆవుపేడ నశింపజేస్తుందని వారు ముందే పసిగట్టారు. పేడ విలువను గుర్తించిన నేటితరం ఆవుపేడతో చెయ్యలేనిది ఏమీ లేదని నిరూపిస్తున్నారు. ఇప్పటికే ఆవు పేడతో సేంద్రియ ఎరువులు, బయోగ్యాస్ , పిడకలు, విభూతి, పళ్లపొడి, రాఖీలు, ప్రమిదలు, బొమ్మలు, దేవుళ్ల ప్రతిమలు, కుండీలు, జపమాలలు, అగరొత్తులు అంటూ ఎన్నో రకాలుగా ఆవు పేడను వినియోగిస్తున్నారు. ఇలా ఆవు పేడలో మూలికలు కలిపి అగ్నిహోత్ర పిడకలు తయారు చేసి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు రాజుల కండ్రిగ రైతు సుబ్బరాజు.

- అగ్నిహోత్ర పిడకలు.. ఆరోగ్యధాతువులు
- నగరి మండలం రాజులకండ్రిగలో తయారీ
- ఒక్కో పిడక తయారీకి రూ.25 ఖర్చు
- ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్న వైనం
- ఆరోగ్యాన్ని పంచడమే లక్ష్యమంటున్న రైతు సుబ్బరాజు



ఎండబెట్టి ఉంచిన అగ్నిహోత్ర పిడకలు



నిల్వ చేసిన ఆవు పిడకలు

నగరి : పీల్చే గాలి కూడా ఆరోగ్యాన్ని ఇవ్వాలనే సదుద్దేశంతో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా నగరి మండలం రాజులకండ్రిగకు చెందిన రైతు సుబ్బరాజు అగ్నిహోత్ర పిడకలు తయారు చేస్తున్నారు. రైతుగా సేంద్రియ పద్ధతిలో నూతన పంటలు సాగు చేసి అందరి మెప్పు పొందిన ఆయన పాడి రైతుగాను ఆరోగ్యమిచ్చే అంశాలపైనే దృష్టిసారించారు. హోమ పూజలు, ఇళ్లలో దూపం వేసే సమయంలోనూ వచ్చే పొగ ఆరోగ్యాన్ని ఇవ్వాలనుకునే ఆయన పర్యావరణ రక్షణకు సంబంధిత ఆయుర్వేద గ్రంథాలు చదవడం, సంబంధిత శాఖలోని వారిని కలిసి వారి వద్ద సలహాలు, సూచనలు పొంది అగ్నిహోత్ర పిడకల తయారీకి పూనుకున్నారు. కష్టంతో కూడుకున్న పనే అయినా పర్యావరణ రక్షణపై ఉన్న వ్యామోహంతో ఇంటి వద్దే ఒక పాక వేసుకొని అగ్నిహోత్ర పిడకల తయారీ చేస్తున్నారు.

ఒక్కో పిడక రూ.30

10 కిలోల ఆవు పేడతో పిడకలు తయారు చేయాలంటే 3 కిలోల నెయ్యి , పాలు, పెరుగు, పంచితం అవసరం. వీటితో పాటు వేసే మూలికలు స్థానికంగా లభించవు. కొన్ని వస్తువులు చెన్నైలోని ఆయుర్వేద షాపునకు వెళ్లి తీసుకొస్తున్నారు. ఇలా తయారు చేయాలంటే ఒక్కో పిడకకు రూ.25 ఖర్చు అవుతోందని చెబుతున్నారు. వీటిని రూ.30కి విక్రయిస్తున్నారు. లాభాల కన్నా ఆరోగ్యం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నట్లు రైతు సుబ్బరాజు తెలిపారు.

ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు

చుట్టు పక్కల ఉన్న ఆలయాలలో జరిగే హోమ పూజలు, ఇళ్లలో జరిగే పూజలకు వాడటంతో పాటుతో తమిళనాడు, కర్ణాటకలలో జరిగే హోమ పూజలకు అగ్నిహోత్ర పిడకలు నగరి నుంచి తీసుకొని వెళతారు. ఒక్కసారి ఈ పిడకలు వాడి వాటి ప్రయోజనాలు తెలుసుకున్నవారు వాటిని వదలరు.

తయారీ ఇలా....

దేశీవాళీ గిర్ ఆవుల పేడలో నెయ్యి, పాలు, పెరుగు, పంచితం, హోమ ద్రవ్యాలైన రావి, మోదుగ, జమ్మి, అర్క, గరిక, దర్భ, మేడి, చంద్ర, సరస్వతీ, తామర మొదలగు సమిధలతో పాటు సాంబ్రాణి, సర్జారసం, తెల్ల గుగ్గులు, వస, జటామాన్సి, ఆవాలు, కస్తూరి పసుపు, అపరాజిత, వేప, సుగంధి పాల, గ్రంథి తగర, చెంగాల్వ కోస్తు, పచ్చ కర్పూరం మొదలగు సుగంధ భరిత ద్రవ్యాలను కలిపి ముద్దలు చేసి కావాల్సిన ఆకారంలో చేసి ఎండబెడతారు. ఇలా శాస్త్రోక్తంగా పవిత్రంగా ఈ పిడకలు తయారవుతాయి. కావాల్సిన సామగ్రి సమకూర్చడానికి మాత్రమే ఎక్కువ సమయం పడుతుంది. అన్ని వస్తువులు ఉంటే రోజుకు ఒక మనిషి 300 పిడకలు చేసి ఎండబెట్టవచ్చు.





పిడకల తయారీకి సిద్ధం చేసిన మిశ్రమం, కషాయాన్ని తయారు చేస్తున్న రైతు సుబ్బరాజు

వినియోగించడం ఎలా..

ఇంట్లో హోమ ద్రవ్యంగాను , అగ్నిహోత్రంగా, ధూపంగా వేసినట్టైతే మూలికలతో తయారైన ఈ పిడకల నుంచి వచ్చే పొగ రోగ కారక క్రిములను అంతరింపజేసి, వాతావరణ కాలుష్యం నివారించి ప్రాణవాయువు అయిన ఆక్సిజన్ విరివిగా లభిస్తుంది. ఆరోగ్యంతో పాటు సుగంధ భరితమైన సువాసనలతో ఇంటి వాతావరణం ఆధ్యాత్మికతను సంతరించుకుంటుంది.



రామాలయం వద్ద అగ్నిహోత్ర పిడకలతో హోమ పూజలు

ఆరోగ్యం కోసమే చేస్తున్నా

ఆరోగ్యకరమైన పంటల కోసం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. అలాగే గాలి కూడా వీలైనంత మేర ఆరోగ్యకరంగా ఇవ్వాలనే ఆలోచనే ఈ పిడకల తయారీకి దారి తీసింది. పూర్వీకులు ఉదయాన్నే సూర్యుడి నుంచి వెలువడే అతినీల లోహిత కిరణాల నుంచి వెలువడే రేడియేషన్‌ను నిర్మూలించేందుకు ఆవుపేడను నీళ్లలో కలిపి కళ్లాపి చల్లేవారని ఈ మధ్య కాలంలో జరిపిన ప్రయోగాల్లో కనుగొన్నారు. ఒక పిడక మీద సెల్ ఫోన్ ఉంచినప్పుడు అది వెలువరించే రేడియేషన్ పరిమాణం తగ్గినట్లు గుర్తించామని శాస్త్రవేత్తలు తెలిపినట్లు పత్రికల్లో చదివాను. ఆయుర్వేద గ్రంథాలలో వాయు కాలుష్య నివారణకు సూచించిన మార్గాలను తెలుసుకొని ఆయుర్వేదానికి సంబంధించి కొందరి సలహాలతో అగ్నిహోత్ర పిడకలను తయారు చేస్తున్నా. లాభాల కన్నా ఆరోగ్యం ఇవ్వాలనే ఉద్దేశంతోనే వీటిని తయారు చేస్తున్నా.

– సుబ్బరాజు, పాడి రైతు, రాజులకండ్రిగ

పేదలపై ప్రభుత్వం చిన్నచూపు

–మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



నారాయణస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి

వెదురుకుప్పం : కూటమి ప్రభుత్వం పది నెలలుగా చేసింది కేవలం మోసాలతో ప్రజలను బురిడీ కొట్టించి పేదల కడుపుకొట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలేనని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆరోపించారు. ఆదివారం ఆయన పుత్తూరులోని అయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఒక్క సంక్షేమ పథకం అమలు చేయకుండా పేదలను చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. అక్రమ కేసులు బనాయిస్తూ అవలంబిస్తున్న నిరంకుశత్వ ధోరణిని నేనెప్పుడూ చూడలేదన్నారు. జగనన్నకు భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మాజీ ముఖ్యమంత్రి అనే విషయాన్ని పక్కన పెట్టి హోం మంత్రి అనిత వెటకారంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతున్నట్లు చెప్పారు. ప్రజల తిరుగుబాటు మొదలైతే ఎలాంటి వారైనా ప్రజాగ్రహానికి గురౌతారని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహాలను ధ్వంసం చేస్తున్నా కూటమి ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎస్సీ నేతలు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ వ్యవహరిస్తున్న తీరును తప్పు పడుతూ హైకోర్టు మొట్టి కాయలు వేస్తున్నా మార్పు రాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇటీవల జరిగిన మేయర్, డిప్యూటీ మేయర్, ఎంపీపీ ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో ఉన్న నాయకులు ఎలాంటి ప్రలోభాలు, బెదిరింపులకు వెరవకుండా కూటమి అరాచకాలకు ఎదురొడ్డి పార్టీకి వెన్నుదన్నుగా నిలబడడం విశ్వసనీయత, నిబద్ధతతకు నిదర్శనమన్నారు. పీఏసీలో సభ్యుడుగా తనకు స్థానం కల్పించినందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజీ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

20 లోపు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని ఇంటర్మీడియట్ డీవీఈవో సయ్యద్ మౌలా అన్నారు. ఈ మే రకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడా రు. ఇంటర్ ఫలితాలపై మార్కులను రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ చేయించుకునేందుకు వెసులుబాటు ఉందన్నారు. 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖా స్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. రీ కౌంటింగ్‌కు రూ.260, రీ వెరిఫికేషన్‌కు రూ.1300 (ఒ క్కొక్క సబ్జెక్టుకు) ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నా రు. వచ్చే నెల 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తె లిపారు. ఈ పరీక్షలకు హాజరయ్యే ఇంటర్ మొద టి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ నెల 22వ తేదీ లోపు సంబంధిత కళాశాలల్లో ఫీజులు చెల్లించాలని డీవీఈవో వెల్లడించారు.

మేస్త్రీ కుమార్తె సన్‌షైన్ అవార్డుకు ఎంపిక

- ఇంటర్ ఫలితాల్లో మెరిసిన కూలీబిడ్డ
- ఈనెల 15న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ



తల్లిదండ్రులతో అవార్డుకు ఎంపికైన రొంపిచెర్ల కేజీబీవీ విద్యార్థిని శ్రావంతి

చిత్తూరు కలెక్టరేట్ /రొంపిచర్ల : మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవ నం సాగిస్తున్న శివన్న, దేవమ్మ దంపతుల కుమార్తె శ్రావంతి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించింది. జిల్లాలోని రొంపిచెర్ల కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ)లో ఇంటర్మీడియట్ సీఈసీ గ్రూపు పూర్తి చేసింది. ఈ నెల 12న విడుదలైన ఫలితాల్లో ఆ విద్యార్థిని 1000 మార్కులకు గాను 935 మార్కులు సాధించింది. పేద కుటుంబంలో జన్మించి ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రావంతి రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్న సన్‌షైన్ అవార్డుకు ఎంపికై నట్లు జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వెంకట రమణ వెల్లడించారు. పేద కుటుంబంలో జన్మించిన ఆ విద్యార్థిని మట్టిలో మాణిక్యంలా ఉత్తమ ఫలితాలు సాధించడంపై పలువురు అభినందించారు. అవార్డుకు ఎంపికైన ఆ విద్యార్థిని ఈనెల 15వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర మంత్రి లోకేష్ చేతుల మీదుగా విజయవాడలో సన్‌షైన్ అవార్డును స్వీకరించనుంది. ఉత్తమ ఫలితాలు సాధించిన కేజీబీవీ విద్యార్థినిని డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ, టీచర్లు అభినందించారు.

అంతా నిజం.. అడిగితే అబద్ధం!

కలియుగ వైకుంఠనాథుని సన్నిధిలోని టీటీడీ గోశాలలో మృత్యుఘోష భక్తులను ఆవేదనకు గురిచేస్తోంది. పరమ పవిత్రంగా పూజించే గోమాత దుస్థితి హృదయాలను కలచివేస్తోంది. పదుల సంఖ్యలో గోవులు మరణించిన ఘటన కూటమి సర్కారును కుదిపేస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్దలందరూ వేర్వేరుగా ప్రెస్‌మీట్‌లు పెట్టేశారు. వాస్తవాలను వెలుగులోకి తెచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలపై విరుచుకుపడ్డారు. గోవులు మరణించడం నిజం అంటూనే.. భూమన అసత్య ప్రచారం చేస్తున్నారంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. ఒకరికొకరు పొంతన లేకుండా అలవోకగా అబద్ధాలు వల్లించారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి రాష్ట్రమంతా తిప్పిస్తామని బెదిరింపులకు తెగబడ్డారు.

- కూటమి సర్కారును కుదిపేస్తున్న టీటీడీ గోశాల ఘటన
- గోవుల మృతి నిజమేనని మరోసారి ఒప్పుకున్న టీటీడీ చైర్మన్
- 20 నుంచి 22 వరకు మరణించాయన్న బీఆర్ నాయుడు
- 40 మృత్యువాత పడినట్లు ఎమ్మెల్యే ఆరణి వెల్లడి
- వాస్తవాలను వెలుగులోకి తెచ్చిన భూమనకు బెదిరింపులు
- కేసులు పెట్టి రాష్ట్రమంతా తిప్పుతామని హెచ్చరికలు



సాక్షి టాస్క్‌ఫోర్స్ : టీటీడీ గోశాలలో గోవుల మృతి కూటమి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. అమరావతి నుంచి వచ్చిన ఆదేశాలతో తిరుపతిలో ఆదివారం కూటమి నేతల హడావుడి కనిపించింది. ఎవరికి వారు విలేకరుల సమావేశం నిర్వహించి వైఎస్సార్‌సీపీ నేతలపై విమర్శలు గుప్పించారు. టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చెప్పినవన్నీ అసత్యాలు అంటూనే.. ప్రస్తుత టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గోవులు మృతి చెందడం వాస్తవమేనని ఒప్పుకున్నారు. అయితే వందకుపై చిలుకు కాదని, 40 అని ఎమ్మెల్యే, 20 నుంచి 22 వరకు అని టీటీడీ చైర్మన్ వెల్లడించడం గమనార్హం. ఎస్వీ గోశాలలో గోమాతలు మృత్యువాత పడుతున్నాయని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆధారాలతో బయటపెట్టిన విషయం తెలిసిందే. దీంతో కూటమి సర్కారు ఉలిక్కిపడింది. ఏం చేయాలో దిక్కుతోచక.. భూమన ఆరోపణలను టీటీడీ కొట్టిపారేసినా.. నిజం దాగదని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రకటనలతో నిరూపితమైంది. వృద్ధాప్యం, వివిధ కారణాలతో గోవులు మృతి చెందడం సర్వసాధారణమని బీఆర్ నాయుడు ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆరణి మాత్రం.. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో 'ఎస్వీ గోశాలలో 40 గోవులు మృతి చెందాయని వెల్లడించారు. అయితే అవన్నీ అనారోగ్యంతో మరణించాయని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే ఆదివారం తాజాగా టీటీడీ బోర్డు చైర్మన్, సభ్యుడితోపాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గోశాలను సందర్శించారు. ఈ సందర్భంగా 20 నుంచి 22 వరకు మృతి చెంది ఉండొచ్చని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మరోసారి స్పష్టం చేశారు. అంతటితో ఆగకుండా 'ఇంట్లో మనుషులు చనిపోరా? గోశాలలో ఆవులు వృద్ధాప్యంతో మరణించి ఉంటాయి' అంటూ చెప్పుకొచ్చారు. గోవు కళేబరాల ఫొటోలు చూపిస్తూ ఇవన్నీ మారింగ్ అని, ఎక్కడో మృతి చెందినవి అంటూ కొట్టిపారేసే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే.. టీటీడీ గోశాలలో ఉండాల్సిన డాక్టర్ల కంటే తక్కువగా ఉన్నారని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు.. మామూలుగా ఇక్కడ ఆరుగురు డాక్టర్లు ఉండాలని, ప్రస్తుతం ఒకరు పరారీలో ఉన్నారని, మరొకరు ఏదో కారణంతో రాలేదని టీటీడీ చైర్మన్ మీడియా సమక్షంలోనే ఒప్పుకున్నారు.

ప్రశ్నించే గొంతుకను నొక్కేసే కుట్ర

టీటీడీ గోశాలలో గోవులు మృతి చెందుతున్నాయని భూమన కరుణాకరరెడ్డి వెల్లడించిన వాస్తవాలపై ఎల్లో మీడియా ప్రతినిధులు 'భూమనపై కేసులు నమోదు చేస్తారా? అంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుని పదే పదే ప్రశ్నించారు. ఎల్లో మీడియా ఒత్తిడి మేరకు భూమన కరుణాకరరెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చైర్మన్ ప్రకటించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా కేసులు నమోదుచేస్తామని, ఇప్పటికే కొందరు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారంటూ పరోక్షంగా పోసాని కృష్ణమురళిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. టీటీడీపై అసత్య ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ఈ మేరకు రాబోయే బోర్డు సమావేశంలో తీర్మానం కూడా చేస్తామని భాను ప్రకాష్‌రెడ్డి ప్రకటించడం గమనార్హం. గత వైఎస్సార్‌సీపీ హయాంలో టీటీడీపై అసత్య ప్రచారాలు చేసిన ఇదే నాయకులు నేడు ఇలా మాట్లాడుతుండడంపై ఆశ్చర్యపోతున్నారు.

బోయకొండ.. జనసందడి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాస దీక్షలతో ఆలయం వద్దకు చేరుకొని గంగమ్మకు పూజలు చేశారు. ఇంటర్ ఫలితాలు వెలువడడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో దర్శన కోసం భక్తులు తరలిరావడంతో ఆలయంలో క్యూలైన్‌లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దివ్వెలతో మేళ తాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకొన్నారు.



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

క్లుప్తంగా

కాణిపాకం.. భక్తజనసంద్రం

కాణిపాకం : తిరువణ్ణామలైలో గిరి ప్రదక్షిణకు వెళ్లిన భక్తులు, సెలవులతో తరలివచ్చిన భక్తులతో ఆదివారం కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. పోటెత్తిన భక్తజనంతో ఆలయం జన సందడిని సంతరించుకుంది. దర్శన సేవకు 2 గంటల సమయం పట్టింది. వినాయకుని నామస్మరణలతో మార్మోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఉచితంగా మజ్జిగ పంపిణీ చేపట్టారు.

గంజాయి స్మగ్లర్ అరెస్టు

నగరి : ఆరు నెలల పాటు పోలీసుల కళ్లుగప్పి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు చేస్తున్న మండలంలోని ఓజీ కుప్పం గ్రామానికి చెందిన షణ్ముగం (29)ని పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ విక్రమ్ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఒడిస్సా పరిసర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి సప్‌లై చేసే వారిని, అమ్మే వారిని గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటికే ఓజీ కుప్పంకు చెందిన గంజాయి స్మగ్లర్‌లు కృష్ణ, దొరై, ముత్యాల కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ కి పంపించినట్లు చెప్పారు. 6 నెలల పాటు తప్పించుకొని తిరుగుతున్న స్మగ్లర్ షణ్ముగంను ఆదివారం పట్టుకున్నట్లు వెల్లడించారు. నగరి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు తరలించారన్నారు. గంజాయి సేవించేవారి గురించి, అమ్మేవారి గురించి 94407 96723 నంబరుకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి నిర్మూలనకు పోలీసులకు సహకరించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



శాంతిపురం : కుప్పం – పలమనేరు జాతీయ రహదారిలో మఠం వద్ద ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని సుమారు 55 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వాహనం ఢీకొని రోడ్డు మీద పడి ఉండగా స్థానికులు 108 ద్వారా కుప్పం సీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన రాళ్లబూదుగూరు పోలీసులు మృతుడి ఆచూకీ తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు.



కడుపు కోతలు ఆపేదెలా?

ఆధునిక వైద్య విధానంలోనూ అమ్మలకు కడుపు కోతలు తప్పడం లేదు. ఏటా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ సిజేరియన్‌లు పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. జాతీయ స్థాయిలో సిజేరియన్ ప్రసవాల్లో మన రాష్ట్రం అయిదో స్థానంలో ఉండడం వైద్య నిపుణులను కలవరానికి గురిచేస్తోంది. సిజేరియన్‌లు తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నా అనుకున్న లక్ష్యాలు సాధించడంలో వెనుకబడుతున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు మేల్కొనకపోతే తల్లులు మరింత ప్రమాదంలో పడే ప్రమాదం ఉంది.

– కాణిపాకం

- జిల్లాలో సిజేరియన్లే అధికం
- ప్రైవేటుతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ కోతలే..
- తగ్గుముఖం పట్టిన సాధారణ ప్రసవాలు
- కోతలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు

జిల్లాలో గర్భిణులు బలహీనమవుతున్నారు. పౌష్టికం అందక అల్లాడుతున్నారు. దీంతో గర్భిణులు కడుపు కోతలకు చేరువుతున్నారు. ఇక ఆస్పత్రులు అవసరాన్ని ఆసరాగా చేసుకుని కడుపుకోతలు పెడుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా సిజేరియన్లు పుంజుకుంటున్నాయి. అత్యవసర పరిస్థితిని ఆసరాగా చేసుకొని బలవంతంగా ప్రసవాలు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రక్తం తగ్గిందని, బిడ్డ ఉమ్మనీరు తాగేసిందని, బరువు ఎక్కువగా ఉందని, రక్తపోటు అధికమైందని, బిడ్డ అడ్డం తిరిగిందని.. ఇలా రకరకాల కారణాలు చెబుతూ ఆపరేషన్ వైపు ఆసక్తి చూపుతున్నారు. లక్షల రూపాయల పేరిట ఫీజులు వసూలు చేస్తున్నారు. బాధితుల్లో ఎక్కువగా పేదలు, సామాన్యులు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. సిజేరియన్ ప్రసవాల్లో రాష్ట్రం ఐదో స్థానంలో నిలిచింది. 60 శాతం ప్రసవాలు సిజేరియన్లే ఉన్నాయని వీటిని 30 శాతానికి కుదించాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఆపరేషన్ ప్రసవాలే అధికం

పేరుకే ప్రభుత్వాస్పత్రుల్లో సుఖ ప్రసవాలని చెప్పుకొస్తున్నారు. ప్రచార ఆర్భాటం చేస్తున్నారు. గత ఆరు నెలల కాలంలో మొత్తం 8,983 ప్రసవాలు జరగగా సాధారణ ప్రసవాలు 5,851 జరగగా ఆపరేషన్లు 3132 జరిగాయి. గతేడాది కూడా ఇదే ఇదే పరిస్థితి. ప్రస్తుతం జిల్లాలో 55 నుంచి 60 శాతం వరకు సిజేరియన్లు జరుగుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ రికార్డు స్థాయిలో ఆపరేషన్ల ద్వారా ప్రసవాలు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

- గతేడాది డిసెంబర్ నెలలో చిత్తూరుకు చెందిన ఓ గర్భిణి ప్రసవం కోసం అర్ధరాత్రి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించింది. బిడ్డ పరిస్థితి క్రిటికల్‌గా ఉందని..సిజేరియన్ చేస్తే తల్లీ, బిడ్డ ఇద్దరు సురక్షితమని అక్కడి డాక్టర్లు గర్భిణి కుటుంబీకులకు వివరించారు. వారు చెప్పే మాటలకు భయపడ్డ కుటుంబీకులు వెంటనే తమిళనాడులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు సుఖ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఇద్దరు సురక్షితంగానే ఉన్నారు.



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

- గుడిపాలకు చెందిన ఓ గర్భిణి ఆరు నెలల కిందట ప్రసవం కోసం చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వచ్చింది. అక్కడ అన్ని పరీక్షలు చేసి అత్యవసరమంటూ వెంటనే ఆపరేషన్‌కు సిద్ధపడిపోయారు. ఆపరేషన్‌కు రూ.80 వేలు అవుతుందని చెప్పారు. ఆపై వారు బంధువుల సలహా తీసుకున్నారు. తమిళనాడులోని ఓ ఆస్పత్రి వైద్యులు మాత్రం తొలి చెకప్ నుంచి సుఖ ప్రసవమంటూ చెప్పుకొచ్చారు. దీంతో ఆలోచనలో పడ్డ ఆమె భర్త వెంటనే అంబులెన్స్ ద్వారా వేలూరుకు తీసుకెళ్లారు. అక్కడ సుఖ ప్రసవం చేశారు. రూ.35 వేలతో బయటపడ్డారు.

నిబంధనలకు పాతర

గర్భిణులకు శస్త్ర చికిత్స చేస్తే అందుకు గల కారణాలను రిపోర్ట్‌లో స్పష్టంగా నమోదు చేయాలి. కానీ అనారోగ్య కారణాలు చూపుతూ ఇష్టారాజ్యంగా శరీరంపై కత్తిగాట్లు పెడుతున్నారు. ఆరోగ్యశ్రీ ఉన్నా..అత్యవసరమని చెప్పి శస్త్ర చికిత్సలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. గర్భిణిని తొలి నుంచి పరిశీలించాలి. ఆశా కార్యకర్తలు నిత్యం పరిశీలించాలి. జిల్లాలో అదెక్కడా జరిగిన దాఖలాలు లేవు. శని, ఆదివారాలు వస్తే చాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు కనిపించడంలేదు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది.

ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ..

ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు ఆస్పత్రులు కడుపు కోతలు పెడుతున్నాయి. ఆస్పత్రికి వచ్చిన వారి నుంచి డబ్బు వసూలు చేసి శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. సాధారణ ప్రసవం జరిగే అవకాశం ఉన్నా పట్టించుకోవడంలేదు. రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు కడుపు కోతలకు ఫీజు వసూళ్లు చేస్తున్నారు. దీని కారణంగా భవిష్యత్తులో మహిళలకు అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. అయినా గర్భిణులు చేసేది లేక వైద్యుల మాటలు విని శస్త్ర చికిత్స చేయించుకుంటున్నారు. మరికొందరు ముహూర్తం పేరుతో శస్త్ర చికిత్సకు మొగ్గు చూపుతున్నారు. ఇంకొంత మంది మహిళలు పురిటి నొప్పులు భరించలేక ఆపరేషన్‌కు సిద్ధమవుతున్నారు. ఈ ముహూర్తాల ప్రసవాలు ప్రైవేటు ఆస్పత్రుల్లో జోరుగా సాగుతున్నాయి. దీంతో సాధారణ ప్రసవాల కంటే సిజేరియన్లే అధికమవుతున్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవ వివరాలు

నెల	సుఖ ప్రసవం	సిజేరియన్	మొత్తం
సెప్టెంబర్	575	280	855
అక్టోబర్	599	257	856
నవంబర్	611	261	872
డిసెంబర్	510	283	793
జనవరి	493	222	715

ప్రైవేటు ఆస్పత్రిలో ప్రసవ వివరాలు

నెల	సుఖ ప్రసవం	సిజేరియన్	మొత్తం
సెప్టెంబర్	403	308	711
అక్టోబర్	440	293	733
నవంబర్	466	281	747
డిసెంబర్	459	271	730
జనవరి	446	242	688
ఫిబ్రవరి	414	220	634

సిజేరియన్ కారణాలు..



- టీనేజీ గర్భిణులు
- బిడ్డ బరువు పెరగడం
- బిడ్డ అడ్డం తిరగడం
- ఉమ్మనీరులో తేడా
- బిడ్డ తక్కువ బరువు
- ఆక్సిజన్ సమస్య
- హైరిస్క్ సమయాల్లో...
- తల్లులు ఆరోగ్య సూత్రాలు పాటించకపోవడం
- లేట్ ప్రెగ్నెన్సీ
- నొప్పులు భరించలేని సమయంలో...

నివారణ ఎలా అంటే ..

- గర్భిణులు తొలి నుంచి మంచి పౌష్టికాహారం తీసుకోవాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలి. మందులు, మాత్రలు వాడాలి.
- బీపీ, మధుమేహం కట్టడిలో ఉంచుకోవాలి.
- ప్రసవ సమయానికి ఆస్పత్రిలో చేరాలి.
- ముహూర్తాల పేరుతో ఆపరేషన్లు చేయించుకోకూడదు.

పౌష్టికాహారం తీసుకోవాలి



జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. తినే తిండిలో బలం ఉండాలి. జంక్ ఫుడ్స్ వద్దు. మంచి పౌష్టికం ఉన్న పదార్థాలను తీసుకోవాలి. మూఢ నమ్మకాలు వీడాలి. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. వైద్య సూచనల మేరకు మందులు, మాత్రలు వాడాలి. పురిటి నొప్పులు భరించలేక ఆపరేషన్ల జోలికి వద్దు. బిడ్డకు జన్మనివ్వడం దేవుడు ఇచ్చిన వరం.

– ఉషశ్రీ, గైనిక్ వైద్యురాలు, చిత్తూరు

హైరిస్క్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ



రకరకాల కారణాల వల్ల సిజేరియన్లు జరుగుతుంటాయి. వీటిని కట్టడి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలను అప్రమత్తం చేస్తూ వస్తున్నాం. గర్భిణుల నమోదు విషయంలో తక్షణ స్పందించేలా చేస్తున్నాం. చాలా మంది మూడో నెలో, ఐదో నెలలో నమోదు చేసుకుంటున్నారు. అలాంటి వారిని ముందుగానే గుర్తించి వైద్య సూచనలు, సలహాలు ఇస్తున్నాం. హైరిస్క్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. టీనేజీ గర్భిణులపై దృష్టి సారిస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ల కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం.

– సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

జిల్లా జడ్జి భీమారావు సేవలు స్ఫూర్తిదాయకం

చిత్తూరు అర్బన్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు సేవలు స్ఫూర్తిదాయకమని స్థానిక మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా కోర్టు భవనంలో బదిలీ అయిన భీమారావును సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రమేష్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో భీమారావు అందరికీ ఆదర్శమని కొనియాడారు. అనంతరం భీమారావును న్యాయమూర్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి గురునాథ్, 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి, తొమ్మిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు, ఎర్రచందనం కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి, న్యాయసేవాసదన్ జిల్లా కార్యదర్శి భారతి, న్యాయమూర్తులు పద్మజ, వెన్నెల, ఉమాదేవి, శ్రీనివాస్, బాబ్‌జాన్, న్యాయమూర్తులు పాల్గొన్నారు. అలాగే జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావును కోర్టు అధికారులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు పరిపాలనాధికారి నిర్మల అధికారులు, ఉద్యోగుల పాల్గొన్నారు.

నేడు పోలీసు గ్రీవెన్స్ రద్దు

చిత్తూరు అర్బన్ : అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. అలాగే నగరపాలక సంస్థలో కూడా వేదికను వాయిదా వేస్తూ నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

ఆకట్టుకుంటున్న మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో







ఎక్స్‌పోలో పాల్గొన్న సీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, సాంబ్రామ్ ఇన్‌స్టిట్యూట్ స్టాల్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు, రామయ్య వర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ సంస్థ

తిరుపతి సిటీ: స్థానిక ఆర్టీసీ ఓవర్ బ్రిడ్జి సమీపంలోని చింతలచేను శ్రీరామ తులసి కళ్యాణ మండపం వేదికగా విద్యాస్ఫూర్తి పేరుతో ప్రముఖ యాడ్ 6 అడ్వర్‌టైజింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రెండు రోజుల మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో – 2025 ప్రారంభమైంది. ఇందులో నగర ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తొలి రోజు బెంగళూరు మార్తనహల్లిలోని హిందుస్తాన్ ఏవియేషన్ అకాడమీ, జాలహల్లి ఈస్ట్‌లోని సంబ్రమ్ ఇన్‌స్టిట్యూట్, కృష్ణరాజపురంలోని ఎస్ఈఏ(సీ) ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం, విద్యారంగ నిపుణులు పాల్గొని అడ్మిషన్ల ప్రక్రియ, ఫీజుల వివరాలు, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, పారిశ్రామిక రంగ అవసరాలకు అనుగుణంగా అందించే కోర్సులు, అంతర్జాతీయ కోర్సులపై అవగాహన కల్పించారు. నిర్వాహకులు రఘుకిషోర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరగనున్న మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పోకు ఊహించని రీతిలో స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. బెంగళూరు లాంటి సిటీలో విద్యనభ్యసించి ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలనే విద్యార్థులకు ఇది సరైన వేదికని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'గల్లా' స్వీయ చరిత్రపై వెబ్ సిరీస్

- మహిళలకు స్ఫూర్తిగా స్వీయ చరిత్ర పుస్తకం
- ప్రముఖ రచయిత, మాజీ పార్లమెంటు సభ్యుడు విజయేంద్ర ప్రసాద్

తవణంపల్లె : కల్మషం..అబద్ధం లేకుండా మహిళలకు స్ఫూర్తిదాయకంగా ముద్రించిన గల్లా 'అరుణకుమారి స్వీయ చరిత్ర'లోని కొన్ని అద్భుతమైన అంశాలు ద్వారా వెబ్ సిరీస్ తీయడానికి ఆలోచిస్తున్నానని ప్రముఖ సినీ దర్శకుడు రాజమౌళి తండ్రి, ప్రముఖ కథా రచయిత, మాజీ పార్లమెంటు సభ్యుడు వి.విజయేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఆదివారం మండలంలోని దిగువ మాఘంలోని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్వగృహానికి విచ్చేశారు. ఆయనకు మాజీ మంత్రి అరుణకుమారి, అమరరాజ బ్యాటరీస్ అధినేత రామచంద్రనాయుడు, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. తండ్రికి మంచి కుమార్తెగా.. భర్తకు మంచి భార్యగా, తన పిల్లలకు మంచి తల్లిగా రాజకీయాల్లో రాణిస్తూ ప్రజలకు సేవలు అందించే నాయకురాలుగా ఎదిగిన అరుణమ్మ మహిళలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె సమ్మతిస్తే మంచి సినిమా, వెబ్‌సిరీస్ తీయవచ్చునని అభిప్రాయపడ్డారు. సినీ హీరో గల్లా అశోక్‌కు మంచి కథ రాసి హిట్ చేయించి సినిమా రంగంలో రాణించేలా చూడాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో స్థానికులు, సర్పంచ్ గోపి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్.. చిత్రంలో గల్లా అరుణకుమారి, మాజీ ఎంపీ గల్లా జయదేవ్

తీర్థయాత్రలో విషాదం

- టీచర్ కుటుంబాన్ని కబళించిన రోడ్డు ప్రమాదం
- మహిళా టీచర్ మృతి
- భర్త, కుమార్తె పరిస్థితి విషమం





పుంగనూరు : సుగాలిమిట్ట వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన కారు, ఐషర్ లారీ

పుంగనూరు : ఉపాధ్యాయ దంపతులు నూతన కారు కొనుగోలు చేశారు.. అదే సమయంలో కుమార్తె ఇంటర్‌లో అధిక మార్కులు సాధించడంతో సంతోషంగా తీర్థ యాత్రలకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో తీర్థ యాత్ర అంతిమ యాత్రగా మారింది. ఓ లారీ మృత్యువు రూపంలో వచ్చి ఆ సంతోషాన్ని క్షణాల్లో చిదిమేయడంతో తల్లి మృతి చెందగా భర్త , కుమార్తె ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న విషాదకర సంఘటన ఆదివారం జరిగింది. దీంతో మూడు జిల్లాల్లో విషాదం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. పుట్టపర్తి జిల్లా కదిరి పట్టణంలో నివాసం ఉన్న వెంకటరమణ (48) , శారద (45) ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వీరికి కుమార్తె కీర్తన (17) , కుమారుడు శ్రీకర్ (12) ఉన్నారు. ఇలా ఉండగా వెంకటరమణ నూతనంగా కారు కొనుగోలు చేశారు. కుమార్తె ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 976 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. కుమారుడు శ్రీకర్ గుడివాడలో 7వ తరగతి చదువుతున్నాడు. అంతా సంతోషంగా పున్నమి రోజున శనివారం తమిళనాడులోని తిరువణ్ణామలైలో గిరి ప్రదక్షిణానికి వెళ్లారు. స్వామి వారిని భక్తితో పూజించుకుని , మొక్కులు చెల్లించుకుని ఆదివారం ఉదయం అక్కడి నుంచి కదిరికి బయలు దేరారు. మార్గ మధ్యలో పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్దకు కారు రాగానే ఎదురుగా మదనపల్లె నుంచి అతివేగంగా వచ్చిన ఐషర్ లారీ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో శారద అక్కడికక్కడే మృతి చెందింది. వెంకటరమణ, కుమార్తె కీర్తన తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి బాధితులను మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టంకు తరలించి, దర్యాప్తు చేపట్టారు.





తీవ్రంగా గాయపడిన భర్త వెంకటరమణ, కుమార్తె కీర్తన



ప్రమాదంలో మృతి చెందిన టీచర్ శారద

మూడు జిల్లాల్లో విషాదం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శారద, వెంకట రమణ కుటుంబం పుట్టపర్తి జిల్లా కదిరిలో నివాసం ఉన్నారు. శారద అదే మండలం బాలప్పగారిపల్లెలో టీచర్‌గా పనిచేస్తున్నారు. అలాగే వెంకటరమణ అన్నమయ్య జిల్లా సోంపల్లెలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. కాగా వెంకటరమణ స్వగ్రామం కలకడ మండలం ఎర్రయ్యగారిపల్లె కావడంతో అంత్యక్రియలు అక్కడ నిర్వహించనున్నారు. ఈ ప్రమాద వార్త తెలియగానే మూడు జిల్లాల్లో విషాదం చోటు చేసుకుంది. ఉపాధ్యాయులు, బంధుమిత్రుల రోదనలు పలువురిని కలచివేసింది.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



మృతి చెందిన విద్యార్థి జాహిద్(ఫైల్)

రొంపిచెర్ల : పూతలపట్టు మండలం బండపల్లె వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రొంపిచెర్లకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి జాహిద్ (22) మృతి చెందాడు. దీంతో విద్యార్థి స్వగ్రామం ఫజులుపేటలో విషాదం అలుముకుంది. ఫజులుపేటకు చెందిన మహబూబ్‌బాషా కుమారుడు ముత్తిరేవుల వద్ద ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. కళాశాలలో శనివారం జరుగుతున్న కార్యక్రమానికి ద్విచక్ర వాహనంలో రొంపిచెర్ల నుంచి బయలుదేరగా బండపల్లె వద్ద ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యార్థి జాహిద్ అక్కడికక్కడే మృతి చెందాడు.

సెల్‌ఫోన్ దొంగ పట్టివేత



పోలీసుల అదుపులో నిందితుడు

శ్రీరంగరాజపురం : సెల్‌ఫోన్ దొంగను స్థానికులు పట్టుకున్న సంఘటన మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట కూరగాయల సంతలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు 49 కొత్తపల్లిమిట్టలో ప్రతి ఆదివారం కూరగాయల సంత జరుగుతుంది. ఈ సంతకు శ్రీరంగరాజపురం, గంగాధర నెల్లూరు, వెదురుకుప్పం మండలాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఈక్రమంలో ప్రతి వారం సెల్‌ఫోన్ దొంగతనాలు జరిగేవి. ఆదివారం సాయంత్రం ఓ వృద్ధుడు నుంచి ముగ్గురు నిందితులు సెల్‌ఫోన్ దొంగలించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సెల్‌ఫోన్ దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంత నిర్వహించే ప్రదేశంలో పోలీసులతో నిఘా ఏర్పాటు చేయాలని సంత నిర్వాహకులు, ప్రజలు కోరుతున్నారు.